క్లుప్తంగా

దివ్యాంగులకు భరోసా కల్పించాలి

ఖమ్మంలీగల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ మానసిక దివ్యాంగులకు భరోసా కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. పోలేపల్లిలోని మదర్ థెరిసా మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అక్కడి వసతులు, సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఓటర్ జాబితాల ప్రదర్శన

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు నూతన ఓటర్ల జాబితాను బోర్డులపై ప్రదర్శించారు. ఈ కేంద్రాలను నేలకొండపల్లి తహసీల్దార్ దారా ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2004–2005 మధ్యలో పుట్టినవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని యువతను చైతన్యం చేశామన్నారు. సందేహాలు ఉంటే కేంద్రాల వద్ద జాబితాను చూసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌టీపీ నగర అధ్యక్షుడిగా అప్పిరెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న అప్పిరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడిగా తుమ్మ అప్పిరెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ ఉమ్మడి జిల్లా పరిశీలకులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మండల కార్యదర్శిగా యాలాద్రి

ఖమ్మంరూరల్: వైఎస్సార్‌టీపీ ఖమ్మం రూరల్ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బత్తిని యాలాద్రి నియమితులయ్యారు. పోలేపల్లికి చెందిన ఆయనకు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు నియామకపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగ నియామక అభ్యర్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ సంఘాల జిల్లా కార్యదర్శులు షేక్ బషీరుద్దీన్, నానబాల రామకృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మంచికంటి భవన్‌లో నిర్వహించిన వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 9న జిల్లా మంత్రి కార్యాలయం ముట్టడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, రామకృష్ణ, ప్రవీణ్, ఉపేందర్ నాయక్, రమేష్, శ్రీను, నాగరాజు, సునీల్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ముఖ్యమని ఎస్‌బిఐటీ కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన ఫీడ్ బ్యాక్ ఇన్ఫ్రా కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్ చందర్, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతోపాటు ధీరజ్ శర్మ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	అవతార్–2
వినోద	అలవైకుంఠాపురంలో..
సాయిరాం	కింగ్ ఆఫ్‌ద డయోనోసార్స్
ఆదిత్య	18 పేజెస్
శ్రీనివాస	ధమాకా

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)	
టమాట	16
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	30
కాకర	40
బీర	46
దొండ	46
పొట్లకాయ	30
చిక్కుడు	50
గోరుచిక్కుడు	46
క్యాబేజీ	16
క్యాలీఫ్లవర్	20
ఆలుగడ్డ	26
చామగడ్డ	58
క్యారెట్	26
క్యాప్సికం	46

ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)		
బచ్చలికూర	2	10
పాలకూర	3	10
చుక్కకూర	2	10
తోటకూర	2	10
గోంగూర	3	10
మెంతికూర	5	20
కొత్తిమీర	1	20
పుదీన	1	15

-ఖమ్మం వ్యవసాయం

పార్కింగ్ అస్తవ్యస్తం..!

పెద్దాస్పత్రిలో వాహనాలు ఎక్కడ పడితే అక్కడే..

- నిర్వాహకులను పట్టించుకోని వైనం
- పర్యవేక్షణ లేక ఇబ్బందులు పడుతున్న రోగులు



ఆస్పత్రి ఆవరణలో..



ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఆస్పత్రికి వచ్చే వారు వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్క్ చేస్తుండటంతో ఆవరణమంతా గందరగోళంగా కనిపిస్తోంది. దీంతో పనులపై వచ్చే మిగతా వారు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఆస్పత్రికి కొన్నేళ్లుగా రోగుల తాకిడి పెరగగా, నిత్యం 1,200 నుండి 1,500 మంది వరకు వస్తున్నారు. వీరితో పాటు సహాయకులను కలుపుకుంటే నిత్యం వచ్చే 3 వేల మందితో రద్దీ ఉంటుంది. అయితే, ద్విచక్ర వాహనదారులకు తోడు కార్లలో వచ్చే వారు పద్ధతి ప్రకారం కాకుండా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో రోగులు, సహాయకులు కూర్చోవడానికి వీలులేకుండా పోతోంది.

వాహనదారుల ఇష్టారాజ్యం

జిల్లా ఆస్పత్రిలో పార్కింగ్ బాధ్యతలను స్తంబాద్రి పట్టణ దివ్యాంగుల సమాఖ్యకు అప్పగించారు. ఈ గ్రూపునకు చెందిన పది మంది దివ్యాంగులు వాహనదారుల వద్ద నుండి రుసుము వసూలు చేస్తుంటారు. అయితే అందరూ దివ్యాంగులే కావడంతో వాహనదారులు వారి మాట పట్టించుకోవట్లేదు. పార్కింగ్‌కు ఆస్పత్రి ప్రారంభంలో కొంత మేర స్థలం కేటాయించినా అక్కడ కాకుండా నేరుగా లోపలకు వచ్చి ఇష్టమున్న చోట వాహనాలు నిలుపుతున్నారు. ముఖ్యంగా జనరల్ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, టీబీ హాస్పిటల్, మార్చురీ, సఖీ కేంద్రం, ట్రామా కేర్ సెంటర్, ల్యాబ్, ఆస్పత్రి కార్యాలయం వద్ద రద్దీగా ఉంటోంది. కాగా, సమాఖ్య బాధ్యులకు డబ్బు వచ్చినా, లేకున్నా ప్రతీనెల రూ.15,600 ఆస్పత్రికి చెల్లించాల్సి ఉండడంతో అంత డబ్బు చాలాసార్లు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

స్థలం లేక సమస్య..

పెద్దాస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వస్తుండగా.. ఎప్పుడో 50 ఏళ్ల క్రితం కేటాయించిన పార్కింగ్ స్థలం సరిపోవడం లేదు. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేస్తుండగా, తరచుగా వాహనాల దొంగతనాలూ జరుగుతున్నాయి. ఈ విషయంలో నిఘా కోసం ఏర్పాటుచేసినా సీసీ కెమెరాల్లో చూసినా ఫలితం ఉండడం లేదు. ఇకనైనా ఆస్పత్రిలో వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలం కేటాయిస్తే సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించట్లేదు.

ఎవరూ వినడం లేదు



మా గ్రూపు ఆధ్వర్యాన పార్కింగ్ నిర్వహణ చేస్తున్నా, వాహనదారులు చాలామంది మా మాట వినడం లేదు. ఇష్టమున్న చోట పార్క్ చేస్తూ, కొందరే రుసుము చెల్లిస్తుండడంతో నెల గడవటమే ఇబ్బందిగా ఉంది. అధికారులు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కేటాయించి మాకు సహకరించాలి.

– క్రిష్ణయ్య, పార్కింగ్ నిర్వాహకుడు

నిర్వహణ సరిగ్గా చేయలేకపోతున్నారు

సమాఖ్య బాధ్యులు పార్కింగ్ నిర్వహణ సరిగా చేయలేకపోతున్నారు. దీంతో వాహన చోదకులు ఎక్కడ పడితే పార్క్ చేస్తుండగా మిగతా వారు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల చోరీపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయంలో అధ్యయనం చేసి సమస్య పరిష్కరానికి యత్నిస్తాం

– బి.శ్రీనివాసరావు, ఆర్‌ఎంఓ

విద్యాసంస్థలకు అవార్డులు..



అవార్డు అందుకుంటున్న గీతాంజలి కరస్పాండెంట్ టీవీ అప్పారావు



అవార్డు అందుకుంటున్న ఆక్స్‌ఫర్డ్ కరస్పాండెంట్ జాఫర్ మతీన్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలలకు స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు లభించినట్లు ఆయా పాఠశాలల యజమాన్యాలు తెలిపాయి. నగరంలోని గీతాంజలి పాఠశాలకు స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించాయి. హైదరాబాద్‌లో హైటెక్స్‌లో 10వ జాతీయ విద్యా సదస్సులో పాల్గొన్న గీతాంజలి కరస్పాండెంట్ టీవీ అప్పారావుకు అవార్డును అందించి అభినందించినట్లు డైరెక్టర్లు టి.పద్మ, టీ.అరుణ్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది అభినందనలు తెలిపారు.

అదే విధంగా నగరంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించగా కరస్పాండెంట్ జాఫర్ మతీన్‌కు సైతం అవార్డు అందించి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సిద్ధికా సిబ్బంది అభినందనలు తెలిపారు.

హార్వెస్ట్ కరస్పాండెంట్‌కు ఎడులీడర్ అవార్డు

హైదరాబాద్‌లో హైటెక్స్‌లో జరిగిన బ్రెయిన్ ఫీడ్, ఇటి టెక్స్ ఎక్స్‌పో 10వ కాన్ఫరెన్స్‌లో హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్‌కు ఎడులీడర్ అవార్డు లభించింది. ఈ మేరకు అవార్డును హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణాశాఖామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామిబోధమయానంద అందించినట్లు రవిమారుత్ తెలిపారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.



అవార్డును చూపిస్తున్న హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి, నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర మహాసభలను వాల్‌పోస్టర్లను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ మహాసభలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. యూనియన్ బాధ్యులు చిర్రా రవి, వెన్నబోయిన సాంబశివరావు, చక్రవర్తి, రామకృష్ణ, శెట్టి రజనీకాంత్, రమేష్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన గోళ్ల ధనలక్ష్మీ, వల్లపనేని క్రిష్ణకుమారి, బజ్జూరి మాణిక్యమ్మ, ఉదరపు క్రిష్ణమూర్తి, బండి రాములు, ములుకూరి నరేందర్‌రెడ్డి, సాంబోజు జయలక్ష్మీ మరణించగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదారాబాద్ ఎల్‌వీ.ప్రసాద్, అపోలో, వాసన్, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు గురువారం పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

13, 14న మహాసభలు

కూసుమంచి: ఈనెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య కోరారు. గురువారం కూసుమంచిలో సభల పోస్టర్‌లను ఎంఈఓ బీవీ రామాచారి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆవిష్కరించగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, రవికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ1104 యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ యూనియన్ ప్రతినిధులు, నాయకులు ఆవిష్కరించారు.



ఖమ్మంమయూరిసెంటర్: రెజోనెన్స్ విద్యాసంస్థల క్యాలెండర్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్.వి.నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్స్ సతీష్, భాష్కర్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు.

సభ్యత్వ రుసుము చెల్లించండి

ఖమ్మంలీగల్: న్యాయవాదులు సభ్యత్వ రుసుము చెల్లించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు కోరారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం మేరకు ఈనెల 31లోగా సభ్యత్వ రుసుము చెల్లించి సహకరించాలని ఆయన గురువారం ఓ ప్రకటనలో సూచించారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

ఖమ్మంగాంధీచౌక్: దేశంలో వివిధ సంస్థలు, పథకాల పైరవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిన్నింటి రమ్య, సుధారాధ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపరింటెండెంట్‌కు కలిసి వినతిపత్రం అందజేశాక రమ్య, సుధారాధ మాట్లాడారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కిలారు ఉమాదేవి, పెరుమాళ్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'క్రియేటివ్'లో నో బ్యాగ్ డే



ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్న కరస్పాండెంట్ కమలాకర్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని క్రియేటివ్ హైస్కూల్‌లో నో బ్యాగ్ డే నిర్వహించినట్లు కరస్పాండెంట్ కమలాకర్ బిజ్జాల, డైరెక్టర్ కౌషిక్, బిజ్జా తెలిపారు. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు వినూత్న రీతిలో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు పాట పాడుతూ విద్యార్థులతో బోధిస్తుండటంతో సోషల్ మీడియాలో అధికంగా లైక్స్ వచ్చాయన్నారు. విద్యార్థుల ఆటపాటలతో తొందరగా గుర్తుపెట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని అభినందించినట్లు తెలిపారు.

గరిడేపల్లిలో టీఎల్‌ఎం మేళా

కామేపల్లి(కారేపల్లి): మండలపరిధిలోని గరిడేపల్లి గ్రామంలో టీఎల్‌ఎం మేళా ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన అభ్యాసన పరికరాలను గురువారం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన పరికరాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, టి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి



ప్రయోగ నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూసుమంచి: విద్యార్థులకు చదువుతో పాటు అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. పాలేరులో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ ఎడవెల్లి మంగమ్మ, అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, ఎంఈఓ బీవీ రామాచారి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ..

నేలకొండపల్లి: మండలం లో పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి గురువారం పర్యటించారు. బైరవునిపల్లి లో మృతి చెందిన సల్లా సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు ఎస్‌డీ.కర్ణ, టెమ్జూ అధ్యక్షుడు వనం అచ్యుత్‌రావు, కార్యదర్శి టి.హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు లిక్కి హనుమంతరావు, మోర సైదులు, శివాజీ, వెంకటేశ్వర్లు, సైదులు, కోలేటి నారాయణ, పంబ శ్రీనివాస్, అబ్దుల్, రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతి లాభదాయకం



డ్రమ్‌సీడర్ పద్ధతిని వివరిస్తున్న ఏడీఏ

కూసుమంచి: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి నాటడం వల్ల రైతులకు ఎంతో లాభదాయకమని ఏడీఏ విజయచంద్ర అన్నారు. గురువారం మండలంలోని పోచారం గ్రామంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పద్ధతిలో విత్తనాల ఖర్చు తగ్గటంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. దీంతో ఎకరానికి రూ.8 వేల వరకు ఆదా చేయవచ్చన్నారు. పంటకాలం కూడా తక్కువగా ఈ పద్ధతిలో ఉన్నందున రైతులు ఈ విధానాన్ని అవలంబించి మంచి దిగుబడులను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, సీఆర్పీ చిరంజీవి పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, నాయకులు

ఖమ్మం లీగల్/ఖమ్మం మామిళ్లగూడెం: నగరానికి చెందిన న్యాయవాదులు మోజేష్ క్రిస్టోఫర్, ఆవుల అనురాధపై జరిగిన దాడికి నిరసన గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.వీరేందర్ మాట్లాడుతూ... న్యాయవాదులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఆమోదించాలని ప్రభుత్వాన్ని కోరారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, న్యాయవాదులు కర్లపూడి శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి, దంతాల నారాయణ, ఎంఏ.తౌఫిక్, నేరెళ్ల శ్రీనివాసరావు, ఆర్.సుధీర్ సింగ్, ఎం.ప్రకాష్, జానయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, న్యాయవాద దంపతులపై దాడిని నిరసిస్తూ బీఎస్పీ ఆధ్వర్యాన జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఉపేందర్‌సాహుతో పాటు వీరేందర్, వెంకటేశ్వర్లు సుగుణారావు, క్రిస్టోఫర్, ముక్తేశ్వరరావు, రాంబాబు, మాధవి, షేక్ నజీమా, అనురాధ, నాగేశ్వరావు, నాగరాజు, విజయ్, రమేష్, వంశీ, రాజశేఖర్, బోస్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ ప్రవేశాలు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ఫ్ మేనేజ్‌మెంట్ వసతిగృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అందరికీ సీట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సీట్లు ఇవ్వడంతో పాటు సంక్షేమ అధికారులే స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ చేసే బాధ్యత తీసుకోవాలనే డిమాండ్‌తో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు యువరాజు భూక్య సతీష్, జిల్లా నాయకులు నవీన్, నరేష్, గోపి, వెంకటేష్, సాయి, పవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి మండలంలో పలు నర్సరీలను ఏంపీడీఓ పీవీఎస్ఎన్ గుప్తా గురువారం పరిశీలించారు. ఆయా గ్రామపంచాయితీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాగ్ ఫిల్లింగ్, వాటరింగ్‌లను శ్రద్ధగా చేసి, నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, సర్పంచ్ ఎం.దుర్గాజ్యోతి, పంచాయితీ కార్యదర్శి నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: వివిధ రంగాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలు పాలకులు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీదేవి ఈ మేరకు ఆశ వర్కర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఈ నెల6న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలో వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఆశవర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్వరి, జ్యోతి, సుభద్ర, ఉష, ఉమా, పుష్ప, నాగమణి, రమయ్య, పూలమ్మ పాల్గొన్నారు.

తపాలా సేవకుడు ప్రసాదరావు

ఖమ్మంగాంధీచౌక్: భారత తపాలా శాఖలో 45 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పాటు సేవలందించిన పొనుగోటి ప్రసాద్‌రావు ఉద్యోగులకు ఆదర్శప్రాయుడని ఖమ్మం నార్త్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేష్ అన్నారు. గ్రామీణ ప్రాంతంలో తపాలా సేవలందించి పంద్రేగుపల్లి పోస్ట్ మాస్టర్‌గా పదవీ విరమణ పొందిన ప్రసాదరావును గురువారం యూనియన్ ప్రతినిధులు తపాలా అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు దంపతులను సహచర ఉద్యోగులు శాలువాలు కప్పి అభినందించారు. గ్రామీణ డాక్ సేవక్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ శ్రీనివాస్, రామయ్య, శ్రీనివాస్‌రావు, మల్లిఖార్జున్ రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

దివ్యాంగులకు నో ఎంట్రీ..

మండల కేంద్రంలో తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలోకి దివ్యాంగులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. భవనంలోకి వీల్ చైర్లు ఎక్కేలా ర్యాంపు లేకపోగా, కేవలం మెట్లు మాత్రమే నిర్మించారు. దీంతో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న దివ్యాంగులు గ్రంథాలయానికి వచ్చినా నిరాశగా ఇంటి బాట పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ర్యాంపు ఏర్పాటుచేయాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

- నేలకొండపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కిషోర్, గ్రంథాలయ పాలకుడు
సెల్ నంబర్ : 99590 53103